క్లుప్తంగా

ఎంపీడీఓగా మిశ్రో

సీతంపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బీబీ మిశ్రోను నియమించారు. పాందూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడకు ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వస్తున్నారు.

సాగునీరు అందించాలి..

పాలకొండ: తోటపల్లి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘ నాయకుడు ఎం. కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తోటపల్లి ఎడమ కాలువ పరిధిలోని శివారు గ్రామాలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సాగునీరు అందించాలని కోరుతూ బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాలువలకు మరమ్మతులు చేయించాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని వాపోయారు. రైతులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో యంత్ర ప్రతిష్ఠ


యంత్ర ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

పాలకొండ రూరల్: నగరంలోని కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న మేధో దక్షిణామూర్తి విగ్రహానికి సంబంధించి యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుడు జోశ్యుల కూర్మనాథశర్మ ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా చేపట్టారు. విగ్రహ దాతలు పైల శంకరరావు దంపతులు కార్యక్రమానికి సహకరించగా.. ఆగమ శాస్త్రంను అనుసరించి విగ్రహ స్థాపన చేపట్టనున్నట్లు అర్చకులు అజేయశర్మ తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


ఖైదీలకు సూచనలిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సత్ప్రవర్తనతో మెలగాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణ ఖైదీలకు సూచించారు. కురుపాం పోలీస్‌స్టేషన్ వద్ద ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం, చినమేరంగి, జియ్యమ్మవలస, గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని దొంగతనం కేసుల్లోని ముద్దాయిలతో ఆదివారం సమావేశమై పలు సూచనలు చేశారు. కొంతమంది అనుకోని పరిస్థితులు, తప్పనిసరి పరిస్థితుల్లో నేరాలు చేసి జైలుకు వచ్చి ఉండివచ్చని, ఇప్పటికైనా చేసిన తప్పును తెలుసుకుని మంచి నడవడికను అలవర్చుకోవాలని తెలిపారు. మనలో మార్పు వచ్చిందన్న విషయం మనకు మొదట తెలియాలన్నారు. జైలు నుంచి విడుదలయ్యాక ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.

కనకదుర్గ ఆలయ ప్రారంభోత్సవం

సీతానగరం:మండలంలోని నీలకంఠాపురంలో గ్రామస్తులు నిర్మించుకున్న కనకదుర్గమ్మ గుడి ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులంతా పూజా సామగ్రి, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆర్ గోపాలరావు, పార్వతమ్మ కుటుంబసభ్యులు మాట్లాడుతూ కనకదుర్గ గుడి నిర్మాణం పూర్తి కావడంతో ప్రతిష్ఠ ఉత్సవాలు జరిగాయని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ అన్నసంతర్పణ నిర్వహించామన్నారు.

ఈదురుగాలితో రూ.2.25 లక్షల ఆస్తినష్టం

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట, బూర్జ ఏపీఈపీడీఎల్ సబ్ స్టేషన్ల పరిధిలో ఇటీవల వచ్చి తుఫానుగాలికి విద్యుత్ శాఖకు చెందిన రూ 2.25 లక్షల విలువైన ఆస్తులకు నష్టం వాటిల్లినట్లు ఏఈ శశిభూషణరావు తెలిపారు. మండలకేంద్రంలో చెట్లు, కొమ్మలు వైర్లపై పడిపోవడంతో 26 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయన్నారు. అలాగే వైర్లు తెగిపోవడం, ఇన్సులేటర్లు పేలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వంటి రూపాల్లో విద్యుత్ శాఖకు ఆస్తినష్టం వాటిల్లిందని తెలియజేశారు.

నారుమళ్ల చదునులో రైతులు

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేయడానికి మండలంలోని రైతులు వరినారు మళ్ల తయారీకి మట్టి దుక్కుల పనుల్లో నిమగ్నమయ్యారు.ఖరీఫ్ వరిసాగు చేయడానికి వీలుగా రైతులు వరి వెదలు, డ్రమ్ సీడర్, యంత్ర పరికరాలతో వరినాట్లు వేయనున్నారు. వరి ఉభాలు చేయడానికి ముందుగా వరినారు వేయడానికి ఆకు మడి తయారు చేస్తున్నారు.

ఇలా అయితే ఎలా సారు..?

పార్వతీపురం టౌన్: స్వచ్ఛ సుందర పార్వతీపురం దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఒక పక్క మున్సిపల్ అధికారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమం కేవలం ఫొటోలకే పరిమితమైందని మరోవైపు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఆదివారం పార్వతీపురం పట్టణంలో జగన్నాథపురం వెళ్లే దారిలో కాలువల్లో తీసిన పూడికలను రోడ్డుపైనే వదిలేయడంతో దుర్గంధంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

● ఏటీవీ రైడ్స్ పునఃప్రారంభం ..



అడ్వంచర్ పార్కులో ఆల్‌టర్న్ వెహికల్స్ (ఏటీవీ) సేవలు ఆదివారం పునఃప్రారంభమయ్యాయి. పర్యాటకులు పార్కులో పర్యటించడానికి గతంలో ఏర్పాటు చేసిన ఈ వాహనాలు పాడవ్వడంతో మూలకు చేరాయి. తాజాగా ఐటీడీఏ పీఓ చొరవతో రెండు ఏటీవీ వాహనాలు కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. - సీతంపేట

● భక్తిశ్రద్ధలతో ఉజ్జిడి పూజ



వేపారమ్మ గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా స్థానిక గుమ్మలక్ష్మీపురంలో ఉజ్జిడి పూజ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ బి.గౌరీశంకరరావు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని, ఉజ్జిడి బండిని వీధుల్లో ఊరేగించారు. -గుమ్మలక్ష్మీపురం

● నేరడిలో రక్తపుట్టమ్మ సంబరాలు



మండలంలోని నేరడి-బిలో రక్తపుట్టమ్మ సంబరాలను గ్రామస్తులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నేరడి - బిల్లుమడ గ్రామాల మధ్య వెలిసిన రక్తపుట్టమ్మ సన్నిధికి ఘటాలతో భక్తులు మేళతాళాల నడుమ ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. భామిని

వేసవికాలం.. వ్యాధుల భయం!



- వేసవిలో పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- వడదెబ్బ, డయేరియా, నిర్జలీకరణం సమస్యలు
- టైఫాయిడ్, మలేరియా జ్వరాలూ ప్రబలే అవకాశం

గరుగుబిల్లి:

వేసవికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎండల బారినపడితే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, అలాగే డయేరియా, నిర్జలీకరణం సమస్యలు సహా మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయి. మరోవైపు ఈగలు, దోమలు వాలడం ద్వారా కలుషితమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సలహా ఇస్తున్నారు.

గొడుగు, వాటర్‌బాటిల్..

వీలైనంత వరకు ఎండల్లో తిరగవద్దని, అత్యవసరమై ఎండలోకి వెళ్లాల్సి వస్తే చేతిన గొడుగు, వాటర్ బాటిల్ పట్టుకుని వెళ్లాలి. గొడుగు.. శరీరంపై ఎండ పడకుండా రక్షణ కల్పిస్తుంది. తద్వారా వడదెబ్బ, నిర్జలీకరణం సమస్యలకు గురికాము. ఒకవేళ మండుటెండకు దొరికిపోతే కళ్లు తిరగడం, శరీరంలోని నీరంతా కోల్పోయి దాహం వేయడం, ఒక్కోసారి కిందపడిపోవడం జరుగుతుంది. ఈ సమయంలో ప్రథమ చికిత్స లభ్యం కాకపోతే చనిపోయే ప్రమాదం ఉంది. ఇవేవీ దృష్టిలో ఉంచుకోకుండా అజాగ్రత్తగా వ్యవహరిస్తే ముప్పు తప్పదు.

రోజుకు 5 లీటర్ల నీరు తాగాలి..



మెరుగైన ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ రోజుకు 5 లీటర్ల నీరు తాగాలి. అత్యవసర పరిస్థితుల్లో ఎండలోకి వెళ్లాల్సి వస్తే గొడుగు, తువ్వాలు, కళ్లజోడు, టోపీ, వాటర్‌బాటిల్ పట్టుకుని వెళ్లాలి. నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. వడదెబ్బ బారిన పడితే వ్యక్తి అరచేతిని బాగా రుద్దాలి. ఉప్పు కలిపిన నీటిని తాగించాలి. జ్వరం, నీరసం, వాంతులు, విరేచనాలు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కన్పిస్తే వైద్యుడిని సంప్రదించాలి. -కాసుల వర్మ, హోమియో వైద్యాధికారి, గరుగుబిల్లి పీహెచ్‌సీ

వేసవి వ్యాధులు-లక్షణాలు..

- శరీరానికి వేడితాకితే మెదడులోని కణాలు సక్రమంగా పనిచేయడం మానేస్తాయి. ఈ కారణంగా తలనొప్పి, కళ్లు తిరగడం, కళ్లమంటలు, వాంతులు, నొప్పులు వస్తాయి.
- చెమట ఎక్కువ పట్టి శరీరంలోని నీరు స్వేదరంధ్రాల ద్వారా బయటకు పోతుంది. దీంతో కొందరు తీవ్ర అలసటకు గురవుతారు. ఎక్కువ శాతం నీటిని కోల్పోవడం వల్ల శరీరం ఆరిపోయి జ్వరం వస్తుంటుంది.
- తరచూ జలుబు, దగ్గు, కాళ్లు, కండరాలు పట్టేయడం, చర్మం కమిలిపోవడం, చెమట పొక్కులు రావడం వంటివి వస్తాయి.
- జ్వరం, వాంతులు, విరేచనాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఓఆర్ఎస్, ఉప్పు కలిపిన నీరు వెంటనే తాగాలి. ఎండలో తిరుగుతున్నంతసేపు నీరు ఎక్కువగా తరచూ తాగాలి.
- వేసవిలో చిన్నపిల్లలను ఎండలో ఆడనివ్వరాదు. వారికి ఉదయం, సాయంత్రం చల్లని నీటితో స్నానం చేయాలి. నూలు వస్త్రాలు మాత్రమే వేయాలి. దూర ప్రయాణాలు తగ్గించాలి. ఓఆర్ఎస్ ద్రావణం ఎక్కువగా తాగించాలి.

నేటి నుంచి నీలమ్మ-నూకాలమ్మ గ్రామదేవత పండగ


విద్యుత్ అలంకరణలో నీలమ్మ గుడి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేటలో నీలమ్మ-నూకాలమ్మ గ్రామదేవత పండగ సోమవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఆర్ఎస్ స్రవంతి, ఉత్సవ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. దైవదర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలో సోమవారం సాయంత్రం 3 గంటలకు అమ్మవారి(పాదాలు)ని తెచ్చుకోవడం జరుగుతుందని, ఆ తర్వాత ప్రతిరోజూ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, ఘటాల ఊరేగింపు వంటివి చేపట్టడం జరుగుతుందన్నారు.

ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కురుపాం తహసీల్దారు ఎం.రమణమ్మ ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారంతా అర్హులేనని, దగ్గరలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఇంటి స్థలం కేటాయించడం జరుగుతుందన్నారు. అలాగే గత రెండు రోజులుగా వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని, మేఘావృతమైనా, వర్షం కురిసే సూచనలు ఉన్నట్లు భావిస్తే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలన్నారు.

పీఎం జన్‌మన్ ఇళ్లకు మోక్షం


ఎర్రన్నగూడలో నిర్మాణంలో ఉన్న గృహాలు

సీతంపేట: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీలకు (పర్టికులర్లీ వానరబుల్ ట్రైబ్ గ్రూప్) కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు మోక్షం లభించనుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 2024 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 1232 ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా... పునాదుల స్థాయిలో కొన్ని, శ్లాబు స్థాయిలో మరికొన్నిఉండగా. 29 గృహాలు పూర్తయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.33 లక్షలు మంజూరు చేస్తోందని హౌసింగ్ ఏఈ వెంకటేష్ తెలిపారు. నిర్మాణాలు చేపడుతున్న వారికి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వృద్ధురాలి బీపీ పరీక్షిస్తున్న డాక్టర్ సూర్యప్రకాష్

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలో ఉన్న వారితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది శిబిరానికి వచ్చి, ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. మొత్తం 21 మంది వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ..



చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని పాలకొండ శాఖా గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పిల్లలకు ఆదివారం మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రముఖుల జీవిత గాదలను వివరించారు. కార్యక్రమంలో ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు. - పాలకొండ రూరల్

వాహన తనిఖీలు


బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పాలకొండ రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాలకొండ - సీతంపేట, వీరఘట్టం ప్రధాన రహదారుల్లో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు నిర్వహించి మద్యం మత్తులో ఉన్న వారికి అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో ఏఎస్సైలు ధర్మారావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రంగుమారిన జీడి


తురాయిమానుగూడలో ఎండబెట్టిన జీడి పిక్కలు

సీతంపేట:

ఇటీవల కురిసిన ఈదురు గాలులకు జీడి పిక్కలు రాలిపోవడంతో వాటి రంగు మారింది. పూర్తిస్థాయిలో తయారుకాని జీడి పిక్కలు నేలరాలడంతో నష్టపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. నాణ్యత లేకపోవడంతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని వాపోతున్నారు. నాణ్యతను బట్టి కిలో రూ. 100 నుంచి 150 రూపాయల మధ్య కొనుగోలు చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి..

భామిని: మండల పరిధిలో ఇళ్లు లేని పేదలు స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎన్. శివన్నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సమీప సచివాలయాల్లో దరఖాస్తులు అందజేస్తే.. అర్హతలను బట్టి ప్రభుత్వం స్థలాలు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం ..

సీతంపేట: కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాల కోసం నిరుపేదల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మరీ ఇంత నిర్లక్ష్యమా..?


జగన్నాథపురం రహదారిలో రోడ్డుపైన వదిలేసిన కాలువ పూడికలు

పార్వతీపురంటౌన్: ఓ పక్క ట్రాఫిక్ పోలీసులు, మరోపక్క రవాణాశాఖ సిబ్బంది రహదారి భద్రత నియమావళిపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు వాటిని పట్టించుకోవడం లేదు. ఆదివారం పార్వతీపురం పట్టణంలో రహదారి భద్రత నియమావళికి విరుద్ధంగా ఆటోలో నిర్లక్ష్యంగా వెళ్తుండగా ''సాక్షి''కి చిక్కిన దృశ్యం.

వినూత్న రీతిలో సీహెచ్‌ఓల నిరసన

- మంత్రి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్

పార్వతీపురంటౌన్: సీహెచ్‌ఓలపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వెన క్కి తీసుకొవాలి ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ వద్ద నోరు మూసుకుని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై మంత్రి జులుం ప్రదర్శించడం సరైన విధానం కాదని మండిపడ్డారు. మీ బాధలు వినడం మా పని కాదంటూ మంత్రి చెప్పడం బాధ్యతా రాహిత్యమన్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని డిమాండ్ చేశా రు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే చెల్లించి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా పితృత్వ సేవలు మొదలైనవి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగదీష్, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

● మూన్నాళ్ల ముచ్చటే..

పాలకొండ డివిజన్ కేంద్రంలోని ప్రధాని కూడలిలో (వీరఘట్టం - విశాఖ కూడలి) భారీ గోతులేర్పడ్డాయి. ఈ రహదారిపై నిత్యం వందలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ మార్గంలోనే జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ముఖ్య కూడిలో రోడ్డు మధ్యలో భారీగా గోతులు ఏర్పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో కొన్నాళ్ల కిందట పోలీసులు గోతులు కప్పే క్రమంలో మట్టి వేయించారు. ఆ తర్వాత మరమ్మతులు కూడా చేశారు. అయితే నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పనులు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. మళ్లీ గోతులు బయటపడడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. - పాలకొండ రూరల్

మొక్కజొన్న రైతులకు ఇక్కట్లు


నేరడిలో మొక్కజొన్న గింజలను కుప్పలుగా పెడుతున్న రైతులు

భామిని: అకాల వర్షాలతో మొక్కజొన్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకోవడంతో ఎక్కడ వర్షం పడుతుందోనని రైతులు ఆందోళన చెందారు. వెంటనే ఆరబెట్టిన గింజలను బస్తాలకు ఎత్తి భద్రపరిచారు. వాటిపై టార్పాలిన్లు కప్పారు.

మరో రెండు, మూడు రోజుల్లో విక్రయిద్దామనుకున్న తరుణంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జూన్ 8న వీరఘట్టం హైస్కూల్ వజ్రోత్సవ వేడుకలు

- వేడుకల నిర్వహణకు ఏకగ్రీవ తీర్మానం


వజ్రోత్సవ వేడుకలపై చర్చించడానికి సమావేశమైన పూర్వ విద్యార్థులు

వీరఘట్టం: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్ స్థాపించి ఈ ఏడాదితో 75 వసంతాలు కావస్తోంది. ఈ నేపథ్యంలో 1969 నుంచి 2020 వరకు పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వపు విద్యార్థులు జూన్ 8న హైస్కూల్ వజ్రోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొన్ని బ్యాచ్‌లకు చెందిన కొంత మంది పూర్వపు విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. పాఠశాల వజ్రోత్సవ వేడుకల నిర్వహణ కోసం పలు తీర్మానాలు చేశారు. కేవలం పూర్వ విద్యార్థుల సహాయంతో వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు.